## కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 25, పచ్చిమిర్చి 70, బెండ 40, కాకర 60, దొండ 40, దోస 30, ఆలు 35, చామ 60, కీర 40, బీర 60, వంకాయ 40, గోకర 40, బీన్స్ 120, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 30, క్యారెట్ 50, చిక్కుడు 80, ఉల్లి 25(కేజీ), ములక్కాయలు (2)10 ,క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 150, వెల్లుల్లి 250.

## వాహన తనిఖీలు



జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల టోల్‌ప్లాజా వద్ద సోమవారం అధికారులు, పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. ఎన్నికల్లో భాగంగా హైదరాబాద్–మెదక్ జాతీయ రహదారిపై అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు.

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన కొండ విజయ్‌కుమార్

హఫీజ్‌పేట్: ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం చందానగర్ హుడా కాలనీ రోడ్డులో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చైర్మన్ కొండ విజయ్‌కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానికులు రాధేశ్యామ్ అగర్వాల్, ప్రేమ్ చంద్‌జైన్, రాజేశ్ జైన్, అనిల్ జైన్, సురేష్ చౌదరి, సునీల్ జైన్, నక్కా శ్రీను, విజయ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.





శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్వీప్ నోడల్ ఆఫీసర్లు (ఫైల్)

# పోలింగ్.. పెంచేలా

**అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి ● ఇప్పటికే 50 చోట్ల అవగాహన కార్యక్రమాలు**

శేరిలింగంపల్లి: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ శాతం పెంచడంపై అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. సిస్టమేటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్ (ఎస్‌వీఈఈపీ) 2024పై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తూ వస్తోంది. శేరిలింగంపల్లి నియోజకవర్గం చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గంలోనే కాకుండా తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు ఉన్నది కావడంతో ఎన్నికల సంఘం, జీహెచ్‌ఎంసీ, ఇతర శాఖల అధికారులు సైతం ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఓటు హక్కు ఉన్న ప్రతి వ్యక్తి ఓటు వేయాలని కోరుతున్నారు. సోషల్ మీడియా, అవగాహనా కార్యక్రమాల ద్వారా ఓటింగ్ శాతం పెంచాలనే లక్ష్యంతో సాగుతున్నారు. స్వీప్ నోడల్ ఆఫీసర్లు పోలింగ్ పెంచాలనే లక్ష్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

**ఓటర్ల వివరాలు..**

శేరిలింగంపల్లి తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక ఓటర్లు కలిగి ఉన్న అసెంబ్లీ నియోజకవర్గంగా గుర్తింపు పొందింది. చేవెళ్ల నియోజకవర్గం కూడా అత్యధిక ఓటర్లు కలిగిన సెగ్మెంట్‌గా ఉండడంతో అధికార యంత్రాంగమంతా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

**భారీగా అవగాహన కార్యక్రమాలు**

- శేరిలింగంపల్లి రిటర్నింగ్, ఉప రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో స్వీప్–2024 నోడల్ ఆఫీసర్లు అవగాహనా కార్యక్రమాలు భారీగా సాగుతున్నాయి.
- ఇప్పటికే శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో 50 చోట్ల అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా ఐటీ సంస్థలు, కాలనీలు, బస్తీలు, పార్కులు, జన సమ్మర్ధం ఉన్న ప్రాంతాలలో ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.



- పోలింగ్‌రోజు సెలవుదినం కావడంతో యువ ఓటర్లు, కొత్త ఓటర్లు, విద్యావంతులు, ఐటీ ఉద్యోగులు అందరూ ఓటు వేయాలని అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

**శేరిలింగంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్**

మొత్తం పురుష ఓటర్లు : 4,00,230 మంది
మహిళా ఓటర్లు: 3,57,503 మంది
ఇతర ఓటర్లు: 111 మంది
మొత్తం ఓటర్ల సంఖ్య ..7,57,874 మంది

### ప్రతి ఒక్కరూ ముందుకురావాలి



ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులు ఓటువేసేలా చూడాలి. పోలింగ్‌రోజు సెలవు కావడంతో ఓటు వేయాలనే భావన అందరిలోనూ రావాలి. పట్టణ ప్రాంతాలలో అది కూడా చదువుకున్నవారు ఉంటున్న చోట్లనే పోలింగ్ తక్కువగా ఉంటోందనే విమర్శలు వస్తున్నాయి. దాన్ని తిరగరాయడానికి ఈసారి ప్రతి ఒక్కరూ ముందుకురావాలి.

– టి రామస్వామియాదవ్, కన్వీనర్, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్

### ఓటు వేయడం బాధ్యత



ఓటు వేయడం అందరి బాధ్యత. అధికారులు కూడా కాలనీలు, బస్తీలు, అత్యధికంగా పబ్లిక్ ఉండే ప్రాంతాలలో, ఐటీ సంస్థలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో కూడా అవగాహన కలిప్పించారు. దీంతో ఈసారి ఓటింగ్ శాతం పెరుగుతుందనే అభిప్రాయం ఉంది. ఐటీ ఉద్యోగులు కూడా ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారు.

– మహేష్‌రెడ్డి, ఐటీ ఉద్యోగి, వెంకటేశ్వర కాలనీ

### ఓటు వేసేలా బాధ్యత తీసుకోవాలి



పోలింగ్ రోజు ఓటుహక్కు ఉన్న వారంతా ఓటు వేయాలి. 85 ఏళ్లు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు వేసేలా ఏర్పాట్లు చేశారు. యువత, ప్రైవేటు, ఐటీ సంస్థలు, ఇతర కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులంతా ఓటు వేయాలి.

– రజనీకాంత్‌రెడ్డి, ఈఆర్‌ఓ, శేరిలింగంపల్లి

## స్టార్టప్స్ ప్రోత్సాహం కోసం రూ.50కోట్ల నిధి ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక స్టార్టప్‌లలో రూ. 50కోట్ల వరకు పెట్టుబడి సహాయం అందించేందుకు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (వైఎఇ) మాగ్నిఫిక్ క్యాపిటల్ ట్రస్ట్‌లు థైరోకేర్ సృష్టికర్త డాక్టర్ ఎ వేలుమణితో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. అందులో భాగంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు నగరంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాకర్ ఆలపాటి మాట్లాడుతూ, గత దశాబ్దకాలంగా స్టార్టప్‌లకు మద్దతు అందిస్తున్నామని, ఈ కొత్త ఫండ్ ప్రారంభం స్టార్టప్ వ్యవస్థ విస్తరణలో ఒక మైలురాయిగా పేర్కొన్నారు. భిన్న రంగాలలో ఆవిష్కరణలు చేస్తున్న స్టార్టప్స్ తమకు info@yeaindia.orgలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

## నేడు అష్టోత్తర శత కలశాభిషేకం

మోతీనగర్: మోతీనగర్, కబీర్‌నగర్‌లోని శ్రీ శివరామాంజనేయ ఆలయంలో 30వ తేదీ మంగళవారం ఉదయం 7.30 గంటలకు అఖిల భారత శ్రీ హనుమద్దీక్షా పీఠమ్ పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామి చేతుల మీదుగా శత కలశాభిషేకం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

## మే 1న దీవెన పండుగ

నిజాంపేట్: కల్వరిగ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మే 1వ తేదీ సాయినగర్‌లోని సీజీఎం చర్చిలో దీవెన పండుగ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బ్రదర్ జార్జి బుష్ హాజరై ప్రసంగించనున్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ ప్రార్థనల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## బూస్టర్‌ల ఏర్పాటు



ఖిజ్రా కాలనీ వద్ద ఏర్పాటు చేసిన బూస్టర్

మణికొండ: ఎత్తులో ఉన్న కాలనీలకు నీటి సరఫరా పెంచేందుకు జలమండలి అధికారులు బూస్టర్‌లను ఏర్పాటు చేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఖిజ్రా, పాషా తదితర కాలనీలు ఎత్తులో ఉండటంతో నీటి సరఫరా సరిగా జరగటం లేదు. దీంతో ఎత్తులో ఉన్న కాలనీలలోని గృహాలకు సరిపడ నీటి సరఫరా జరగాలంటే తప్పనిసరిగా బూస్టర్‌లను ఏర్పాటు చేయాలని జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి నిర్ణయించారు. మంగళవారం ట్రయల్ రన్‌తో సరఫరాను తనిఖీ చేస్తామని జలమండలి అధికారులు తెలిపారు. నీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన జలమండలి అధికారులకు ఆయా కాలనీలవాసులు కృతజ్ఞతలు తెలిపారు. నీటి సరఫరా సమయాన్ని మరో 15 నిముషాల పాటు పెంచాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: వేగంగా వచ్చిన బైక్ ఢీ కొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భానుప్రసాద్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఓ వ్యక్తి (55) కొండాపూర్‌లోని ఆర్టీఓ ఆఫీస్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఫ్యాషన్ బైక్ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. మృతదేహన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపరిచారు. సంబంధిత వ్యక్తులెవరైనా ఉంటే 8712568118 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## కేసీఆర్ రోడ్‌షోపై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: మే 8వ తేదీ కేసీఆర్ రోడ్ షో జరగనున్న ఇస్నాపూర్ చౌరస్తాను సోమవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా కార్యక్రమ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమీన్‌పూర్ ఎంపీపీ దేవానందం, ముత్తంగి మాజీ సర్పంచ్ ఉపేందర్, ఇస్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ కుమార్‌గౌడ్, సీనియర్ నాయకులు ప్రభాకర్ గుప్త, మెరాజ్ ఖాన్, సందీప్, శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, అబేద్, తులసిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ‘వర్షపు నీటి కాలువలో మురుగు’ సమస్య పరిష్కారం



డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించిన మున్సిపల్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఇంద్రానగర్ కాలనీ వద్ద ‘వర్షపు నీటి కాలువలో మురుగు’ అనే శీర్షికతో ఇటీవల ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. వర్షపు నీటి కాలువలో డ్రైనేజీ నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఈనెల 25వ తేదీ సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో అక్కడ పగిలిపోయిన డ్రైనేజీ పైపులైన్లను తొలగించి నూతన పైప్‌లైన్లను ఏర్పాటు చేశారు. దీంతో సమస్యకు శాశ్వతంగా పరిష్కారమైందని అధికారులు తెలిపారు.

# ‘నాట్య తరంగిణి’ నృత్యోత్సవం



మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం అంతర్జాతీయ నృత్యోత్సవాలలో భాగంగా కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి , శిల్పారామం సంయుక్తంగా నాట్య తరంగిణి నృత్యోత్సవాన్ని నిర్వహించారు. కలకత్తాకి చెందిన రాజీబ్‌ఘోష్ బృందం కథక్ ప్రదర్శనతో అలరించారు. ఇందులో శివతాండవం, తరణ అంశాలను ప్రదర్శించారు. ఒరిస్సాకి చెందిన దేబాశిష్ పట్నాయక్ ఒడిసీ నృత్యప్రదర్శనలో మధురాష్టకం, ఆంగిక, అంశాలను, కెనడాకు చెందిన శక్తిసంజన సిరాలా, రిషికేష్, దేవి కీర్తనం అంశాలను , మోహినియట్టం స్వర్ణదీప , పేరిణి సంతోష్ పెరుమాండ్ల పేరిణీ తాండవంను ప్రదర్శించారు. రవి కూచిపూడి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో ఆకట్టుకున్నారు.ఇందులో పూజ నృత్యం, ఆధ్యాత్మిక రామాయణ కీర్తన, జయము జయము, మూషికవాహన అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు సంజయ్‌జోషి, వేదాంతం సత్య నరసింహశాస్త్రి విచ్చేసి కళాకారులను ఆశీర్వదించారు.

# ఓటరు స్లిప్‌ల పంపిణీ పూర్తి చేయాలి

**ఏఆర్‌ఓ స్నేహ శబరీష్**



గచ్చిబౌలి జడ్‌పీహెచ్‌ఎస్‌లో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఏఆర్‌ఓ స్నేహ శబరీష్

గచ్చిబౌలి: ఓటరు స్లిప్‌ల పంపిణీని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం ఏఆర్‌ఓ, వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం గచ్చిబౌలిలోని జడ్‌పీహెచ్‌ఎస్ , కొండాపూర్‌లోని పోలింగ్ స్టేషన్లను ఆమె తనిఖీ చేశారు. బూత్‌స్థాయి అధికారులు, సెక్టోరల్ ఆఫీసర్లు ఫొటో జత చేయబడిన ఓటరు సమాచార స్లిప్‌లను ఓటర్లందరికీ పంపిణీ చేయాలని ఆదేశించారు. పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తక్కువ ఓటరు స్లిప్‌లు పంపిణీ చేసిన ప్రాంతాలపై ఏఆర్‌ఓ దృష్టి సారించారు. కొండాపూర్‌లోని శ్రీరాంనగర్‌లో ఓటరు స్లిప్‌ల పంపిణీని పరిశీలించి బీఎల్‌ఓలతో ఆమె మాట్లాడారు. ఏవైనా లోపాలు ఉంటే సంబంధిత నోడల్ ఆఫీసర్ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి

**కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి డా.రంజిత్‌రెడ్డి**

హఫీజ్‌పేట్: కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని గంగారం హుడా కేఫ్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుందామన్నారు. రానున్న రోజుల్లో చేవెళ్ల అభివృద్ధి పథంలో దూసుకుపోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ అబ్జర్వర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ చైర్మన్ జేరిపేటి జైపాల్, నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, అన్ని డివిజన్ల కంటెస్టెడ్ కార్పొరేటర్లు, మైనార్టీ సోదరులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.





కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డి

## సోలార్ ఉత్పత్తుల్లో విప్లవాత్మకమైన వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యామ్నాయ విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ ఉత్పత్తుల్లో అత్యాధునిక ఆవిష్కరణలు మరింత ఊపందుకోనున్నాయని నిపుణులు విశ్లేషించారు. పునరుత్పాదక విద్యుత్‌శక్తిపై మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రెన్యూఎక్స్ ఈవెంట్ ముగిసింది. ఈ సందర్భంగా సోలార్ ఉత్పత్తుల తయారీకి పేరొందిన ఎస్ఎమ్ఎ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఓ సమావేశంలో సంస్థ డైరెక్టర్ కరణ్‌సింగ్ సదస్సులో తమ భాగస్వామ్యం, సంబంధిత వివరాలను వెల్లడించారు. నగరంలో నిర్వహించిన ఈవెంట్‌లో సన్నీ ట్రై పవర్ కోర్ 2, సన్నీ హై పవర్ పీక్ 3 వంటి అత్యాధునిక ఉత్పత్తులను ప్రదర్శించామన్నారు.

## సీనియర్స్ ‘మాట.. పాట’ అదుర్స్

**సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో మాట, పాట కార్యక్రమం**



మాట పాట కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

పంజగుట్ట: వారంతా పదవీ విరమణ పొందిన వారు. ఆదివారం రాత్రి సుమారు 50 మంది అందరూ ఒక్కచోట కలుస్తారు. పాటలు, ఆటలు, మాటలతో యువకుల్లా మారిపోతారు. ఆనంద్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఏర్పాటు చేసుకుని ఆనంద్‌నగర్ కాలనీ మహిళా మండలిలో కళావేదిక ప్రాంగణం ఒకటి ఏర్పాటు చేసుకుని అక్కడ లైబ్రరీ, క్యారం బోర్డ్, చెస్ లాంటి ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. ఈ ఆదివారం మాట, పాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాతతరం సినీ నటులు సబిత (సప్తపది) హీరోయిన్, ఢిల్లీ రాజేశ్వరంలు వచ్చి వీరితో కలిసి మాట, పాట కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రోజూ సాయంత్రం సుమారు 20 మంది సీనియర్ సిటిజన్స్ ఇక్కడ కలుసుకుని లైబ్రరీలో పుస్తకాలు చదవడం, మంచి చెడు మాట్లాడుకోవడం, చెస్, క్యారం బోర్డు ఆడుతుంటామని ఫోరం సెక్రటరీ ఎస్.డి.ప్రభాకర్, అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు తెలిపారు.

## కాంగ్రెస్ పార్టీ విస్తృత ప్రచారం

మియాపూర్: మియాపూర్‌లోని జేపీఎన్‌నగర్ కాలనీలో సోమవారం కాంగ్రెస్ నాయకులు, ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తూ.. ప్లకార్డులను అందజేసి హస్తం గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



కాలనీల్లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, మాజీ కార్పొరేటర్ సాయిబాబా, నాయకులు

రాయదుర్గం: చేవెళ్ల పార్లమెంటు సీటును భారీ మెజార్టీతో గెలిచి గులాబీ జెండా ఎగురవేస్తామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధీమా వ్యక్తం చేశారు. గచ్చిబౌలి డివిజన్‌లోని సాయివైభవ్, సాయిఐశ్వర్య కాలనీలలో సోమవారం మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, నాయకులతో కలిసి ఎమ్మెల్యే పాదయాత్ర చేస్తూ ఓటర్లకు పార్టీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ పార్టీకి అడ్డా అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని విమర్శించారు. మోసం చేసే కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, వార్డు, ఏరియా మాజీ సభ్యులు పాల్గొన్నారు.

**ఖాజాగూడలో..**

గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు.

**రాజీవ్ గృహకల్పలో..**

శేరిలింగంపల్లి: బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఓటు వేయాలని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సోమవారం పార్టీ కార్యకర్తలతో కలిసి శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహకల్పలో ప్రచారం నిర్వహించారు.

# ఓటు వేయాలి.. పోస్ట్‌కార్డు ప్రచారం

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తూ మేరు విద్యార్థులు పోస్ట్‌కార్డు ప్రచారం చేశారు. సోమవారం మదీనాగూడలోని మేరు ఇంటర్నేషనల్ పాఠశాలలో విద్యార్థులు ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 3వ తరగతి నుంచి 12వ తరగతుల విద్యార్థులు ఒక్కొక్కరు రెండు పోస్ట్‌కార్డులను రూపొందించారు. వీటి ద్వారా ఇరుగుపొరుగు లేదా బంధువులకు అవగాహన కల్పించనున్నారు. విద్యార్థులలో తరగతి గదికి మించి సమాజం పట్ల కర్తవ్య భావాన్ని పెంపొందించడానికి పౌర అవగాహనను రూపొందించారన్నారు. కొత్త ఓటర్లు ఈ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనాలని విద్యార్థులు విన్నవించారు.



మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో పోస్ట్‌కార్డు ప్రచారం చేస్తున్న విద్యార్థులు

# శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

**కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్**



మైత్రీనగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పూజిత

హఫీజ్‌పేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో శేరిలింగంపల్లిలో భారీ మెజార్టీతో గెలిచి కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్‌లో ఆమె ఇంటింటి ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నామన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# సమతానగర్ పార్కులో సౌకర్యాలు కల్పిస్తాం

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్ పార్కును వాకర్స్‌తో కలిసి సోమవారం కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులో వాకింగ్‌కు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అదే విధంగా పార్కు గోడలపై చిత్రాలు, మొక్కలు, ఫుట్‌పాత్‌లపై బెంచీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పార్కులో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

